క్లుప్తంగా

18న వాసవీ మాత ఆలయ వార్షికోత్సవం


వాసవీమాత అమ్మవారు

తాళ్లరేవు: స్థానిక ప్రధాన రహదారిలో వేంచేసియున్న వాసవీ మాత ఆలయ ప్రథమ వార్షికోత్సవం ఈ నెల 18వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఆలయ అర్చకులు ఖండవిల్లి కేశవాచార్యులు నేతృత్వంలో 18వ తేదీ శనివారం ఉదయం అమ్మవారి గ్రామోత్సవం, మధ్యాహ్నం మహిళలచే సామూహిక పూజలు, సాయంత్రం ఊంజల్ సేవ ఉంటాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

వేంకటేశ్వరునికి పంచామృతాభిషేకం



తాళ్లరేవు: స్థానిక భూసమేత వేంకటేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవాల సందర్భంగా స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాలు, పండ్ల రసాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు ఖండవిల్లి కేశవాచార్యులు బృందం స్వామివారిని పచ్చ కర్పూరంతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేటి నుంచి సోమాలమ్మవారి జాతర


జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ

ఉప్పలగుప్తం: మండలంలోని ఉప్పలగుప్తంలో వేంచేసి ఉన్న సోమాలమ్మ అమ్మవారి జాతర శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారి ఆలయం వద్ద సినిమా సెట్టింగులను తలపించేలా విద్యుత్ దీపాలతో అలంకరించారు.

మాదక ద్రవ్యాల నిరోధానికి చర్యలు

యానాం: ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతున్న మాదక ద్రవ్యాల నిరోధానికి కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుళొత్తుంగన్ ఆదేశించారు. పుదుచ్చేరి జిల్లా స్థాయి నార్కో కమిటీ సమావేశంలో ఆయన గురువారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ కుళొత్తుంగన్ మాట్లాడుతూ గంజాయి వంటి మాదక ద్రవ్యాల చలామణి, అక్రమ రవాణా, విక్రయాలపై నిఘా పెంచాలని చెప్పారు. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పాఠశాల విద్య, ఉన్నత విద్యాశాఖ తరఫున పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో లా అండ్ ఆర్డర్ సీనియర్ ఎస్పీ నర్రా చైతన్య, సబ్ కలెక్టర్ వినయ్ రాజ్, విద్యాశాఖ ఉప సంచాలకులు శివగామి, సాంఘిక సంక్షేమ, అటవీ, ఓడరేవు, కోస్ట్‌గార్డ్, టూరిజమ్, వ్యవసాయశాఖల అధికారులు పాల్గొన్నారు.

కుళాయిలు రావడం లేదంటూ ఫిర్యాదు

యానాం: పట్టణ పరిధిలోని యూకేవీ నగర్‌లో గత కొద్దిరోజులుగా కుళాయిల ద్వారా తాగునీరు పంపిణీ కాక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు పీడబ్ల్యూడీ అధికారులకు గురువారం ఫిర్యాదు చేశారు. యానాం బైపాస్‌ను ఆనుకుని ఉంటున్న యూకేవీ నగర్‌తో పాటు భీమ్‌నగర్, కోన గార్డెన్స్ తదితర ప్రాంతాలకు సరఫరా అవుతున్న తాగునీటిని కొన్ని భారీ హోటళ్లు, బిరాన్నీ పాయింట్ల నిర్వాహకులు మోటార్ల ద్వారా తోడేయడంతో తమకు తాగునీరు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోకపోతే తామంతా నిరసన బాట పడతామని యూకేవీ నగర్ నివాసితులైన కోలమూరి లోవరాజు, మందపల్లి చిన్నారావు, మందపల్లి ప్రసాద్ తదితరులు తెలిపారు.

104 వైద్య సేవలు

అంబాజీపేట: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న 104 వైద్య సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారులు సూచించారు. పుల్లేటికుర్రులో 104 వైద్య సేవలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

బియ్యమో రామచంద్రా

- రేషన్ షాపుల మూసివేతతో పంపిణీ కాని ఉచిత బియ్యం
- యానాంలో ప్రజా పంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తం



యానాం కోపరేటివ్ స్టోర్స్ కార్యాలయం



దరియాలతిప్పలో మూసివేసిన రేషన్ దుకాణం

యానాం: నియోజకవర్గంలో ప్రజా పంపిణీ వ్యవస్థ(పీడీఎస్) ద్వారా పేదవర్గాలకు నెలవారీ ఇచ్చే ఉచిత బియ్యం పథకం కొన్నేళ్లుగా అమలు కాకపోవడం తీవ్ర విమర్శలకు గురవుతోంది. నెలల తరబడి ఈ పథకం ద్వారా వచ్చే బియ్యం పంపిణీ నిలిపివేతతో పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పుదుచ్చేరిలో 2016 సంవత్సరం జూన్‌లో సీఎం నారాయణసామి ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడింది. అప్పట్లో కొన్ని నెలలు ఉచిత బియ్యం పంపిణీ చేసినా అనంతరం రేషన్ షాపులు మూతపడ్డాయి. 2021లో సీఎం రంగసామి నేతృత్వంలో బీజేపీ, ఎన్ఆర్ కాంగ్రెస్ ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చింది. అయితే వారు ఎన్నికల మేనిఫెస్టోలో రేషన్ షాపులు తెరిపిస్తామని చెప్పినా అది కలగానే మిగిలిపోయింది. రేషన్ షాపులు తెరుచుకోక పుదుచ్చేరి ప్రభుత్వం ఇచ్చే బియ్యమే కాకుండా ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ యోజన పథకం బియ్యం సైతం ఇవ్వడం లేదని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. పేరుకి నగదు బదిలీ అమలుచేస్తున్నా దాని ద్వారా వచ్చే చిన్నపాటి మొత్తం సొమ్ముతో బహిరంగ మార్కెట్‌లో అధిక ధరల్లో బియ్యాన్ని పేద, మధ్య తరగతి వర్గాలు కొనలేని స్థితిలో ఉన్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మూతబడ్డ 21 రేషన్ దుకాణాలు

బియ్యం, తదితర నిత్యావసర వస్తువులు పంపిణీ చేసే సివిల్ సప్లయిస్ శాఖ ఆధ్వర్యంలో నడిచే 21 రేషన్ షాపులను మూసి వేశారు. దీంతో ఆయా షాపుల్లో పనిచేసే డీలర్లు, సిబ్బందితో సహా 40 మంది ఉపాధి కోల్పోయారు. ప్రస్తుతం పనిలేక, జీతాలు రాక వారి కుటుంబాలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నాయి. సీఎం రంగసామి, సివిల్ సప్లయిస్ శాఖ మంత్రి సాయిశర్వణన్ సైతం రేషన్ దుకాణాలు తెరిపించి బియ్యం పంపిణీ చేస్తామని హామీ ఇచ్చి రెండున్నరేళ్లు గడుస్తున్నా అది అమలు కావడం లేదు. ఇటీవల పార్లమెంట్ ఎన్నికల ప్రచార సభల్లో సైతం పలువురు రేషన్ షాపుల కోసం ఆందోళన చేయడంతో తెరిపిస్తామని మౌఖిక హామీ మాత్రం ఇచ్చారు.

నగదు బదిలీ సొమ్ము సరిపోవట్లే

యానాం నియోజవర్గ పరిధిలో సుమారు 16 వేలకు పైగా బీపీఎల్, ఏపీఎల్ కార్డులున్నాయి. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా 22 రేషన్ దుకాణాల్లో అంత్యోదయ, ఎరుపు రంగు కార్డుదారులకు, బీపీఎల్ కుటుంబాలకు 20 కేజీల చొప్పున, దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్నవారికి 10 కేజీల చొప్పున బియ్యాన్ని పంపిణీ చేసేవారు. ప్రస్తుతం అవన్నీ వెలవెలబోతున్నాయి. బియ్యానికి బదులు బ్యాంకుల్లో నగదు బదిలీ సొమ్మును జమ చేస్తున్నారు. ఆ సొమ్ముతో బహిరంగ మార్కెట్‌లో బియ్యం కొనలేని పరిస్థితి ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగదు ఇవ్వడం మానేసి బియ్యం పంపిణీ చేయాలని కోరుతున్నారు. వికలాంగులకు సంవత్సరం నుంచి ఇవ్వాల్సిన బియ్యం సైతం ఇవ్వడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2018 ఆగస్టు 15న 25 కేజీల చొప్పున సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా ఉచిత బియ్యం ఇచ్చారని మళ్లీ ఇప్పటివరకూ ఇవ్వలేదంటున్నారు.

ఉచిత బియ్యం ఇవ్వాలి



బీజేపీ, ఎన్ఆర్ కాంగ్రెస్ ఎన్డీయే కూటమి ప్రభుత్వం రేషన్ షాపులు తెరిపించి ఉచిత బియ్యంతో పాటు నూనె, పప్పులు, పంచదార వంటి నిత్యావసరాలు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చినా దాన్ని నిలబెట్టుకోలేదు. పేదలు బహిరంగ మార్కెట్‌లో బియ్యం కొనలేని పరిస్థితి వచ్చింది. నగదు మానేసి ఉచిత బియ్యం ఇవ్వాలి.

– సబ్బితి శ్రీనివాసరావు, గ్రామ పెద్ద, దరియాలతిప్ప

సానుకూల నిర్ణయం తీసుకుంటుందని భావిస్తున్నాం



ప్రజలు ఉచిత బియ్యం ఇవ్వాలంటూ కోరుతున్నారు. ఉచిత బియ్యం పంపిణీ చేసే రేషన్ షాపులన్నీ కొన్నేళ్లుగా మూతపడి ఉన్నాయి. ప్రభుత్వ నిర్ణయంపైనే రేషన్‌షాపుల భవితవ్యం ఆధారపడి ఉంది. ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకుంటుందని భావిస్తున్నాం.

– అబ్దుల్ రజాక్, సివిల్ సప్లయిస్ అధికారి, యానాం

బాబాను దర్శించుకున్న మంత్రి విశ్వరూప్


అమలాపురంలో సాయిబాబాను దర్శించుకుంటున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: పట్టణంలోని కల్వకొలను వీధిలో ఉన్న సాయిబాబా ఆలయంలో బాబాను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ పండితులు తీర్థ ప్రసాదాలు, బాబా హారతి అందించారు. మంత్రి వెంట వైఎస్సార్ సీపీ నాయకులు నల్లా ప్రసాద్, పాటి రవికుమార్, ఈతకోట శ్రావణ్‌కుమార్ తదితరులున్నారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కేవీ సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్ కోర్సులలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ కోర్సులు ఇంగ్లిష్, తెలుగు మాధ్యమాలలో అందుబాటులో ఉన్నాయన్నారు. జూన్ 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభం కానున్నట్లు సత్యనారాయణ తెలిపారు.

పుస్తక పఠనంతో విజ్ఞాన వికాసం


చదవడం మాకిష్టం బ్రోచర్‌ని ఆవిష్కరించిన నల్లా నరసింహమూర్తి


శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ సురేష్

అమలాపురం టౌన్: పుస్తక పఠనం విజ్ఞానానికి దీపికని సాహితీవేత్త, తెలుగు లెక్చరర్ కళావేదిక జిల్లా అధ్యక్షులు నల్లా నరసింహమూర్తి అన్నారు. స్థానిక ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చదవడం మా కిష్టం బ్రోచర్‌ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం నల్లా నరసింహమూర్తి మాట్లాడుతూ విద్యార్థులకు వేసవి సెలవుల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాల్లో పుస్తక పఠనం అలవర్చుకోవాలని, వేసవి శిక్షణా శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ బీవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ మే 16 నుంచి జూన్ 7 వరకూ వేసవి శిక్షణా శిబిరాల్లో పుస్తకాలు చదవడం ద్వారా విజ్ఞానాన్ని పొందాలని సూచించారు. గ్రంథాలయాలు ఉన్నత స్థాయికి ఎదగడానికి దోహదపడతాయన్నారు. పుస్తక పఠనం ద్వారా ఎంతో మంది మహనీయులు ఉన్నత స్థాయికి ఎదగారని, అటువంటి వారిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి జీవీఆర్ఎస్‌హెచ్‌కే వర్మ, ఉపాధ్యాయులు ముత్యాల శ్రీశరత్‌బాబు, గ్రంథాలయ నిర్వాహకులు పోలిశెట్టి సత్యనారాయణమూర్తి, నందుల ప్రసాద్, రాయుడు నాగేశ్వరరావు, లక్ష్మీసౌజన్య తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: స్థానిక ఎస్‌కేబీఆర్ కళాశాలలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ సురేష్ ఉచిత వేసవి శిక్షణా శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి ఎన్ఎస్ఎన్ఐటీ కోచ్ యండ్ర గౌతమ్, నేషనల్ మెడలిస్ట్ కేతా సతీష్ ఆధ్వర్యంలో మే 16 నుంచి జూన్ 15వ తేదీ వరకూ శిక్షణనిస్తారన్నారు. ఉచిత శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చూపాలని విద్యార్థులకు సూచించారు. ఈ ఏడాది రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో జవ్వాది తాతబాబు, ఇందుకూరి శ్రీధర్ వర్మ, ప్రిన్సిపాల్ కుమార్ శాస్త్రి, మునగల మాన్యం, డాక్టర్ నరసింహమూర్తి, పీడీ కేఎస్ ప్రసాద్, చిరంజీవి, జీవీ బాబు, పేరూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యానాంలో కౌంటింగ్ ఏర్పాట్ల పరిశీలన


యానాం ఎస్ఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కౌంటింగ్ కోసం చేస్తున్న ఏర్పాట్లు

యానాం: కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరి ఏకైక పార్లమెంటరీ నియోజకవర్గ స్థానానికి గత నెల 19న జరిగిన ఎన్నికకు సంబంధించి వచ్చే నెల 4న జరగనున్న ఓట్ల లెక్కింపు కోసం చేస్తున్న ఏర్పాట్లను ఆర్ఏఓ, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మునిస్వామి గురువారం పరిశీలించారు. స్థానిక సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్ వద్ద ఈవీఎం ఓట్ల లెక్కింపు కోసం ఏర్పాటుచేసిన టేబుల్స్, గ్రిల్స్‌ను పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. ఆ రోజు ఉదయం 8 గంటల నుంచి కౌటింగ్ ప్రారంభమవుతుందని, మొత్తం 4 రౌండ్లలో అభ్యర్థుల ఓట్లు వివరాలు బహిర్గమవుతాయని సిబ్బంది ఆయనకు వివరించారు. అదేవిధంగా మొత్తం బూత్‌లలో పోలైన ఓట్లలో 5 శాతం వీవీ ప్యాట్ స్లిప్‌లను సైతం లెక్కించనున్నట్లు తెలిపారు.

ఆత్మీయ కలయిక.. ఆనంద డోలిక


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న 1997-98 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

అమలాపురం టౌన్: మండలంలోని మిరియాం ఉన్నత పాఠశాలకు చెందిన 1997–98 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు స్థానిక సత్యనారాయణ గార్డెన్స్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. జీవితంలో ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా సుమారు 25 ఏళ్ల తరువాత తాము చదువుకున్న పాఠశాలలో తిరిగి కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని ఆనంద డోలికల్లో తేలియాడారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు జాన్ పాల్ తదితరులను ఘనంగా సత్కరించుకున్నారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు.

భారీ వర్షాలకు తడిసిన ధాన్యం రాశులు


డి.రావులపాలెంలో తడిసిన బస్తాలను ఒబ్బిడి చేసుకుంటున్న రైతు


ధాన్యం రాశుల కిందకు చేరిన వర్షం నీరు

అల్లవరం: ఆరుగాలం శ్రమించి పండించిన వరి పంటను అకాల వర్షాలు ముంచెత్తాయి. బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యం రాశులు తడిసి ముద్దయ్యాయి. కోతకు సిద్ధంగా ఉన్న వరి క్షేత్రాలు సైతం వర్షం నీటిలో చిక్కుకున్నాయి. మండలంలో సుమారు 500 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లిందని అంచనా వేస్తున్నారు. గూడాల, బెండమూర్లంక గ్రామాల్లో 300 ఎకరాల్లో వరి కోతలు చేయాల్సి ఉండగా వర్షాల వల్ల అది మరింత ఆలస్యం అవుతుంది. రైతుల నుంచి కొనుగోళ్లు చేసిన వ్యాపారులు ధాన్యం బస్తాలను కళ్లాల్లోనే ఉంచేయడంతో భారీ వర్షాలకు ధాన్యం లాటులు తడిశాయి. దేవగుప్తం, డి.రావులపాలెం, ఎంట్రుకోన గ్రామాల్లో ఎక్కువ శాతం ధాన్యం రాశుల కిందకు నీరు చేరింది. దీంతో రైతులంతా గురువారం ధాన్యం రాశులను ఆరబెట్టే ప్రయత్నం చేశారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారి ఎన్‌వీవీ సత్యనారాయణ చెప్పారు. ధాన్యం రాశులపై బరకాలు వేసుకోవాలని, ధాన్యం బస్తాలను సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలని సూచించారు.

రాజస్థాన్ పోలీసులకు సత్కారం


రాజస్థాన్ పోలీసు అధికారులను సత్కరిస్తున్న రూలర్ సీఐ వీరబాబు

అమలాపురం రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా శాంతి భద్రతల పరిరక్షణ కోసం అమలాపురం విచ్చేసి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సహకరించిన రాజస్థాన్ స్పెషల్ పోలీస్ బలగాల సేవలు ప్రశంసనీయమని అమలాపురం రూరల్ సీఐ వీరబాబు కొనియాడారు. గురువారం అమలాపురం తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ శేఖర్‌బాబు ఆధ్వర్యంలో రాజస్థాన్ పోలీసులను సత్కరించారు. ఈ సందర్భంగా సీఐ వీరబాబు మాట్లాడుతూ రాజస్థాన్ రాష్ట్రం నుంచి 86 మంది పోలీసులు ఎన్నికల విధులు నిర్వహించేందుకు అమలాపురం వచ్చారన్నారు. ఇందులో ఒక సీఐ, ముగ్గురు ఎస్ఐలు, 82 మంది పోలీసులు ఉన్నారన్నారు. వారంతా పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా విధులు నిర్వర్తించారని కొనియాడారు. కార్యక్రమంలో ఏఎస్ఐ ఏడుకొండలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చల్ల చల్లని.. కూల్ కూల్


అప్పనపల్లి బట్టీలో ఇటుకలపై కప్పిన బరకాలు


అంబాజీపేటలో కురుస్తున్న వర్షం

- వర్షంతో సేదతీరిన జనం
- ఇటుక బట్టీలకు నష్టం

మామిడికుదురు: వేసవి తాపంతో అల్లాడుతున్న ప్రజలకు ఉపరితల ఆవర్తనం ప్రభావంతో గురువారం కురిసిన అకాల వర్షం ఉపశమనం కలిగించింది. చల్లని గాలులతో కూడిన వర్షంతో ప్రజలు సేద తీరారు. మామిడికుదురు మండలంలో 28.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అకాల వర్షం కొందరికి మేలు చేయగా, మరికొందరికి నష్టం కలిగించింది. వేసవిలో కురిసిన వర్షం కొబ్బరి తోటలకు ఎంతో మేలు చేస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాగా పెదపట్నంలంక, అప్పనపల్లి, పాశర్లపూడి, బి.దొడ్డవరం, నగరం, గెద్దాడ, ఆదుర్రు తదితర గ్రామాల్లో ఇటుక బట్టీలకు ఈ వర్షం తీరని నష్టం కలిగించింది. పదుగుపై ఉన్న వేలాది ఇటుకలు అకాల వర్షానికి తడిసి ముద్దయ్యాయని బట్టీల నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు కొన్ని గ్రామాల్లో ధాన్యం కోత కోసి నూర్పిడి చేశారు. ధాన్యం కళ్లాల్లోనే రాశులుగా వేశారు. ధాన్యం రాశులు తడవకుండా బరకాలు కప్పారు. ధాన్యం రాశుల చుట్టూ వర్షం నీరు చేరిందని రైతులు ఆందోళన చెందారు. అప్పనపల్లి, మామిడికుదురు, పెదపట్నంలంక, పాశర్లపూడి గ్రామాల్లో వర్షం నీరు రోడ్లపై భారీగా నిలిచిపోయింది. ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. మరో నాలుగు రోజుల పాటు వర్షాలు కొనసాగుతాయని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది.

వర్షంతో ఊరట

అంబాజీపేట: మండలంలో బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం ఉదయం వరకూ భారీ వర్షం కురిసింది. కొద్ది రోజులుగా ఎండలకు తాళలేక ఇబ్బంది పడిన జనానికి ఇది కాస్త ఊరట కలిగించింది. అకాల వర్షం కారణంగా జనజీవనం స్తంభించింది. మూడు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఉద్యాన పంటలకు, కూరగాయల సాగుకు, కొబ్బరి తోటలకు ఈ వర్షం ఉపయోగపడుతుందని రైతులు చెబుతున్నారు. మండలంలో వరి సాగు 85 శాతం పూర్తయిందని వ్యవసాయాధికారి సీహెచ్‌డీ విజయ్‌కుమార్ తెలిపారు.

అవగాహనతో డెంగీ నివారణ


పుల్లేటికుర్రులో డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అంబాజీపేట: చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా డెంగీ వ్యాధిని నివారించవచ్చని పీహెచ్‌సీ వైద్యాధికారి ఎ.ఇంద్రావతి అన్నారు. గురువారం ముక్కామల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పుల్లేటికుర్రులో డెంగీ వ్యాధి నివారణ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంద్రావతి మాట్లాడుతూ చిన్న దోమకాటుతో డెంగీ వ్యాధి వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. కొద్దిపాటి జ్వరం వస్తూ, తగ్గుతూ ఉన్నట్లయితే తక్షణమే ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. నివాస ప్రాంతాల్లో దోమలు చేరకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం మంచిదన్నారు. సర్పంచ్ జల్లి బాలరాజు, సీహెచ్‌ఓ రవికుమార్, సబ్ యూనిట్ అధికారి రాజబాబు, సూపర్‌వైజర్ రాధా నరసింహం, ఎంఎల్‌హెచ్‌పీ షైనా, హెల్త్ అసిస్టెంట్ ప్రసాద్, ఏఎన్ఎం ధనలక్ష్మి, ఆశా తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరు: డెంగీ మహమ్మారిని నిర్మూలించేందుకు అంతా కృషి చేద్దామని కొత్తపేట అదనపు జిల్లా వైద్యాధికారి ఎం.సుమలత అన్నారు. చొప్పెల్ల, పెదపళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి, ఆర్.మల్లికార్జున్, డి.సాయికిశోర్ ఆధ్వర్యంలో మండలంలోని పీహెచ్‌సీల ఆవరణలతో పాటు ఆయా గ్రామ సచివాలయాల్లో జాతీయ డెంగీ వ్యాధి నివారణ దినోత్సవం జరిగింది. దోమలపై దండయాత్ర చేద్దాం– ఆరోగ్యంపై జైత్రయాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని వైద్యారోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు.